RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 35 | జనవరి 09, 2026 | వెల : రూ.3-00



4లో.. 'హెచ్‌టీ' విక్రయిస్తే సహించేది లేదు

# కోట్లు వస్తుంటే..
# సస్పెన్షన్ ఓ లెక్కా?!

ప్రతి శాఖలోనూ రాజ్యమేలుతున్న లంచావతారులు

- ☐ అన్నింట్లో టాప్ 'రెవెన్యూ'దే!
- ☐ ఆ తర్వాత పోలీస్, రిజిస్ట్రేషన్ల డిపార్ట్మెంట్లు
- ☐ ఆర్టీఏ, ఫారెస్ట్, చివరికి ఎండోమెంట్ కూడా అదే దారిలో..
- ☐ క్లర్క్ నుంచి అదనపు కలెక్టర్ స్థాయి వరకూ సైడ్ సంపాదనపైనే..
- ☐ సెటిల్‌మెంట్ కేంద్రాలుగా సేవా శాఖలు
- ☐ దొరికితే దొంగ.. దొరకక పోతే దొరలు..
- ☐ రాష్ట్రాన్ని చుట్టుముట్టిన అవినీతి జాఢ్యం
- ☐ పారదర్శకతకు పట్టని పరిపాలన

3లో..




**వేద న్యూస్, క్రైం బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి ఇప్పుడు ఒక్కో శాఖలో కనిపించే చిన్న లోపంగా కాకుండా, వ్యవస్థ మొత్తాన్ని మింగేస్తున్న మహమ్మారిగా మారిపోయింది. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే లంచాల మయంగా మారి, సామాన్యుడి బతుకును ప్రశ్నార్థకంగా మార్చేస్తోందన్న ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. రెవెన్యూ, పోలీస్, రిజిస్ట్రేషన్, ఆర్టీఏ, ఫారెస్ట్, చివరికి ఎండోమెంట్.. శాఖ ఏదైనా సరే, పని కావాలంటే లంచం తప్పనిసరి అన్న భావన ప్రజల్లో బలంగా పాతుకుపోయింది. 'దొరికితే దొంగ.. దొరకకపోతే దొర' అన్న నానుడి నేటి అధికార యంత్రాంగానికి అచ్చుగుద్దినట్లుగా సరిపోతున్న పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు, సెటిల్‌మెంట్లు, ముడుపులు యథేచ్ఛగా సాగుతుండగా, ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను షాక్‌కు గురిచేస్తున్నాయి. చిన్న క్లర్క్ స్థాయి నుంచి తహసీల్దార్, సబ్ కలెక్టర్, ఏసీపీ స్థాయి అధికారుల వరకూ లంచగొండి వ్యవహారాలు బయటపడటం చూస్తుంటే, అవినీతి వ్యక్తిగత తప్పిదం కాదని, వ్యవస్థలోనే వేళ్లూనుకుపోయిందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే ప్రజల జేబులు ఖాళీ చేస్తూ, పరిపాలనపై నమ్మకాన్ని కూల్చేస్తున్న వైనంపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..

## ఏసీబీ వలలో ఎస్సై శ్రీకాంత్




**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

కేయూ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్సై శ్రీకాంత్ ఏసీబీ అధికారుల వలకు చిక్కాడు. పేకాట కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో హన్మకొండ ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. పేకాట కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని వేధిస్తూ కేసును తేలిక చేయాలంటే డబ్బులు ఇవ్వాలని ఎస్సై శ్రీకాంత్ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ట్రాప్ చేశారు.


## 'రైజింగ్ రేవంత్ రెడ్డి' ఆవిష్కరణ

- ప్రజాప్రభుత్వ రెండేళ్ల ప్రగతిపై సావనీర్
- సీఎం నేతృత్వంలోని పాలనపై సమగ్ర విశ్లేషణ
- పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

4లో..

# మహా జాతరకు రండి..

- మేడారం రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం
- మాజీ సీఎం నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేసిన మంత్రులు
- రాజకీయాలకు అతీతంగా ఇన్విటేషన్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు హాజరుకావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును మంత్రులు ఆహ్వానించారు. కేసీఆర్ నివాసానికి వెళ్లిన మంత్రులు జాతర ఆహ్వాన పత్రికతో పాటు తల్లుల బంగారం, బట్టలను ఆయన దంపతులకు బహుకరిస్తూ సంప్రదాయబద్ధంగా ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సమయంలో అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు మేడారం జాతర ఆహ్వానం అందజేశానని తెలిపారు. అయితే ఆ సమయంలో కేసీఆర్‌ను వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశం రాలేదని, మిగతా 4వ పేజీలో..

# త్వరలో ప్రత్యేక విద్యా విధానం

- ప్రభుత్వ పాఠశాలలకు కొత్త బలం
- ప్రీ ప్రైమరీ విద్యతో ప్రభుత్వ బడుల బలోపేతం
- ప్రైవేటు స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు
- గ్రామీణ బడులకు రవాణా సౌకర్యాలపై దృష్టి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రీ ప్రైమరీ విద్యను అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాకూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మిగతా 4వ పేజీలో..

# సంక్షమం, అభివృద్ధి రెండూ సమానమే

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- పేదలు, రైతులు, మహిళల జీవన ప్రమాణాల మెరుగుదలపై దృష్టి
- ఉపాధి హామీ పథకంపై కేంద్ర వైఖరి సరికాదు
- కార్యకర్తల శ్రమతోనే ప్రజాప్రభుత్వం
- రాబోయే మున్సిపల్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి
- సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకుని, వాటికి పరిష్కారాలు చూపడమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత జీవన ప్రమాణాలు మిగతా 4వ పేజీలో..

## అనాథల హక్కులు-యువత జీవన పాఠాలపై రెండు పుస్తకాల ఆవిష్కరణ



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ
- సమాజ బాధ్యతను గుర్తు చేసిన రచనలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

అనాథల హక్కులు, యువత మానసిక వికాసం వంటి కీలక సామాజిక అంశాలపై రచించిన రెండు పుస్తకాలను కేటీఆర్ హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యావేత్త, అనాథల హక్కుల కార్యకర్త సామినేని ఐరిన్ నీరజ రాణి రచించిన ఈ పుస్తకాలు సమాజంలో పెద్దగా చర్చకు రాని అంశాలను వెలుగులోకి తీసుకొచ్చాయి. 'ఇన్ సెర్చ్ ఆఫ్ ఏ నేమ్, ఏ హోమ్, ఏ రైట్ట' పుస్తకం అనాథల జీవితం కేవలం బాల్యంతో ముగిసిపోదని, గుర్తింపు, హక్కులు లేని అనాథల జీవిత పోరాటాన్ని లోతుగా విశ్లేషిస్తుంది. సమాజం సానుభూతితో సరిపెట్టుకోకుండా బాధ్యతగా స్పందించాలనే సందేశాన్ని ఇస్తుంది. 'ది అన్ రిటన్ లెసన్స' పుస్తకం విద్యా వ్యవస్థలో బోధించని జీవిత పాఠాలు, మానసిక బలం, జీవన నైపుణ్యాలపై దృష్టి సారిస్తుంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అనాథల హక్కుల అంశం ఇంకా సమాజంలో తగిన స్థాయిలో చర్చకు రాకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఏ బిడ్డ కూడా రక్షణ, గుర్తింపు లేకుండా పెరగకూడదని, ప్రభుత్వం-సమాజం కలిసి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. యువత మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఇటువంటి పుస్తకాలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనాథల కోసం నిరంతరం కృషి చేస్తున్న సామినేని ఐరిన్ నీరజ రాణిని కేటీఆర్ అభినందిస్తూ, ఈ రచనలు సమాజంలో ఆలోచనలకు దారితీయాలని ఆకాంక్షించారు.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 09, 2026

# హనుమాన్ గుడి వెనుక మురుగు కాలువ నిర్మాణం

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా కాలువ పనులంటూ ఆరోపణలు
- పాత మార్గాన్నే పునరుద్ధరించాలని డిమాండ్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



చంద్రంపేట ఎక్స్‌రోడ్ వద్ద జ్యోతినగర్‌లో ఉన్న చారిత్రాత్మక హనుమాన్ దేవాలయం వెనుక భాగంలో నిర్మిస్తున్న మురుగు కాలువ వివాదాస్పదంగా మారింది. ఆలయ గోడను ఆనుకొని, గ్రామంలోని మురికి నీరంతా దేవాలయం పక్కనుంచే వెళ్లేలా అధికారులు చేపట్టిన ఈ నిర్మాణాలపై భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా వినియోగంలో ఉన్న పాత మురుగు కాలువను పక్కన పెట్టి, కావాలనే దేవాలయానికి ఆనుకొని కొత్త కాలువ నిర్మించడం ఆలయ పవిత్రతను దెబ్బతీయడమేనని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ చర్య హిందువుల మనోభావాలను గాయపరిచే విధంగా ఉందని, దీని వెనుక కుట్ర దాగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా మురుగు నీరు వెళ్లే పాత మార్గంలోనే కాలువను పునర్నిర్మించాలని, దేవాలయం గోడకు ఆనుకొని చేపట్టిన కొత్త కాలువ పనులను వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో అశుభ్రత పెరగకుండా, భక్తుల విశ్వాసాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై చంద్రంపేట ప్రజలు ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి పాత కాలువ మార్గాన్నే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

# తీరనున్న దుమ్ము కష్టాలు

- బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి వరకు కొత్త రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ ప్రజలకు, వ్యాపారులకు ఎట్టకేలకు దుమ్ము, ధూళి సమస్య నుంచి ఉపశమనం లభించనుంది. పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి బస్టాండ్ వరకు సుమారు 600 మీటర్ల మేర నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. గత నెల రోజుల క్రితం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టిని తొలగించి వదిలేయడంతో తీవ్ర సమస్యలు తలెత్తాయి. వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ము లేచి పాదచారులు, స్థానిక నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు దుమ్ము కారణంగా వ్యాపారాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను గమనించిన అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులను ప్రారంభించారు. చెక్కపల్లి బస్టాండ్ నుంచి పాత రోడ్డును తొలగించి, ఆధునిక యంత్రాలతో కొత్త బీటీ రోడ్డు నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు ఎట్టకేలకు పట్టాలెక్కడంతో పట్టణ ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

# బీఎల్ఓలు ఇంటింటి పరిశీలన చేయాలి



**వేద న్యూస్, చందుర్తి**

- బూత్ స్థాయిలో మ్యాపింగ్ చేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షుణ్ణంగా అమలు చేయాలని, బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి తహసీల్దార్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ అధికారులు, సూపర్వైజర్లు, తహసీల్దార్, బూత్ లెవెల్ అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్–2025 జాబితాలో 40 ఏళ్లకు పైబడిన ఓటర్ల వివరాలను, ఎస్ఐఅబశ్రీశ్రీఅర్–2002 జాబితాతో బూత్ స్థాయిలో మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు . రెండు జాబితాల్లో కామన్‌గా ఉన్న వ్యక్తులకు ఎస్ఐఅబశ్రీశ్రీఅర్–2025 వర్తించదని స్పష్టం చేశారు. అలాగే, ఎస్ఐఅబశ్రీశ్రీఆర్ నిర్వహణకు ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఅబశ్రీశ్రీఆర్ డేటాను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో పోల్చి చూడాలన్నారు. రెండు జాబితాల్లో కామన్‌గా ఉన్న పేర్లను మినహాయించి, 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఏ చిన్న నిర్లక్ష్యం కూడా తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల కు సూచించారు. సమావేశం అనంతరం చందుర్తి మండలం మూడపల్లిలో మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. మొత్తం ఎన్ని ఎకరాలు కేటాయించారన్న విషయాన్ని అధికారులను అడగగా, ఆరు ఎకరాల స్థలం కేటాయించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల తనిఖీ

- డిస్ట్రిక్ట్ లెవెల్ ఇన్స్పెక్షన్ ప్యానల్ టీం సంతృప్తి

**వేద న్యూస్, మేడిపల్లి:**



మేడిపల్లి (పడమర)లోని జెడ్పీహెచ్ఎస్ మేడిపల్లి (పడమర) పాఠశాలను డిస్ట్రిక్ లెవెల్ ఇన్స్పెక్షన్ ప్యానల్ టీం సందర్శించింది. బి. రాజేందర్ పీజీహెచ్ఎం ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల ఎక్స్పర్ట్స్‌తో కూడిన బృందం పాఠశాల ప్రార్థన సమయానికే చేరుకొని బోధన, అభ్యాస ప్రక్రియను పరిశీలించింది. తరగతుల వారీగా ఉపాధ్యాయుల బోధనను గమనించి, విద్యార్థులతో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. నోటుబుక్స్‌ను పరిశీలించి విద్యార్థుల అవగాహన, రాతపనిపై సమీక్ష చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నోడల్ అధికారి, సబ్జెక్టు ఎక్స్పర్ట్స్ పలు సూచనలు చేశారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి ఫలితాలు మెరుగుపరచాలని సూచించారు. మొత్తం మీద పాఠశాల చక్కని వాతావరణంలో సక్రమంగా కొనసాగుతోందని ఇన్స్పెక్షన్ టీం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు సి. హెచ్. నాగమణి, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, భీమన్న, లక్ష్మి, సొప్పరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**వేద న్యూస్, హనుమకొండ:**




రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ విమర్శించారు. గురువారం హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్ లో డివైఎఫ్ఐ జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశం రమేష్ ప్రసంగించారు. నిరుద్యోగ యువతకు అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని,దేశంలో బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలు యువతకు ఇచ్చిన హామీలు కేవలం ఓట్లు దక్కించుకునే ఎత్తుగడలేనని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన బిజెపి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పుతుందని, ఉద్యోగాలు లేకుండా చేస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ల తోనే ఉద్యోగాలను భర్తీ చేసి చేతులు దులుపుకుందని, ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా యువతకు ఎటువంటి ఉపశమనం కలగలేదని, నియామక ప్రక్రియలు నత్తనడకన సాగుతున్నాయని, నిరుద్యోగులు నిరీక్షణతో విసిగిపోతున్నారని, ఇటీవల ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా మరో నిరాశగా మిగిలిందని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రతి యువతి కి చేతికి ఒక స్కూటీ ఇస్తామని చెప్పిన హామీ కూడా మరచిపోయారని విమర్శించారు. నిరుద్యోగ యువతపై నిర్లక్ష్యం వీడి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇస్తామని రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ కార్యదర్శి డి.తిరుపతి, జంపాల రమేష్ ,నాయకులు సముద్రాల అనిల్,మంద తేజ , బండారి నరేష్, ఎస్కే సమీర్, వేముల కర్ణాకర్, పల్లర్ల సతీష్ పాల్గొన్నారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధికారి మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ ఊర చెరువులో చేప పిల్లలను వదిలారు. గ్రామ సర్పంచ్ నీరుడి దాస్ సమక్షంలో, గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులతో కలిసి చేప పిల్లలను చెరువులో విడిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీరుడి దాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ఉచితంగా చేప పిల్లలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ఫీల్డ్‌మాన్ శేఖర్, ఫిషరీస్ అసిస్టెంట్ బాలాజీ, గ్రామ పంచాయితీ కార్యదర్శి రాఘవేందర్, ఉపసర్పంచ్, ఎంపీ సుధాకర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు బోయిని సత్తయ్య, సెక్రటరీ ఎంపీ లింగమయ్యతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన

- ఆన్ లైన్ కొనుగోళ్ల విషయంలో జాగ్రత్త
- హక్కులు, బాధ్యతలపై స్పష్టత ఉండాలి
- సేవలు, మోసాలపై జాగ్రత్తలు వివరించిన నిపుణులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్లో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నేటి రోజుల్లో విద్యార్థులు ఎదుర్కొనే వినియోగదారుల సమస్యలు, మోసాలు, వాటిపై ఫిర్యాదు చేసే విధానం, వినియోగదారుల చట్టాలు కల్పించే రక్షణపై వివరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ కొనుగోళ్లు, బ్యాంకింగ్ సేవలు, మొబైల్, ఇంటర్నెట్ సేవల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్పష్టంగా వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వారు మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులపై అవగాహన విద్యార్థి దశ నుంచే అవసరమని, అలా అయి తే భవిష్యత్ లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.




కార్యక్రమానికి సహకరించిన కళాశాల యాజమాన్యానికి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చివరగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇచ్చి, ఫిర్యాదులు ఎక్కడ, ఎలా చేయాలన్న అంశాలపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మంచి స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్‌గా వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆయేషా బాను పాల్గొనగా, ప్రధాన వక్తగా నడిగే దత్తాత్రేయ (దక్షిణ క్షేత్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ) ప్రసంగించారు. అలాగే అడ్వకేట్ సంసాని సునీల్ విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇస్తూ వినియోగదారుల సమస్యల పరిష్కార మార్గాలను వివరించారు.

# జెడ్పీహెచ్ఎస్ పాఠశాల తనిఖీ

- మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచన

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలను టేక్మాల్ సర్పంచ్ తిమ్మి గారి సుధాకర్ సందర్శించారు. ఈ సందర్భం గా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం రుచికరంగా ఉందా? మెనూ ప్రకారమే వడ్డిస్తున్నారా? అనే అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్ఎం రాజేంద్రప్రసాద్‌కు సూచించారు . ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చలికాలం నేపథ్యంలో ఉదయం వేళ చన్నీళ్లకు బదులు వేడి నీళ్లతో స్నానం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ మజహర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ ఆశల సాగర్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, అంబెష్, కాంతం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హాకీ టోర్నమెంట్‌కు రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

- కరీంనగర్ జిల్లా జట్టులో ఎనిమిది మంది క్యాడెట్లకు చోటు జిల్లా జట్టుకు కోచ్‌గా పీఈటీ విక్రమ్

**వేద న్యూస్, చొప్పదండి:**



ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 బాలుర హాకీ టోర్నమెంట్ కు మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్, రుక్మాపూర్ కు చెందిన ఎనిమిది మంది క్యాడెట్లు ఎంపికయ్యారు. వీరు కరీంనగర్ జిల్లా హాకీ జట్టు తరఫున పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా జట్టుకు కోచ్‌గా సైనిక్ స్కూల్ పీఈటీ ఎం. విక్రమ్ వ్యవహరించనున్నారు. ఎంపికైన క్యాడెట్లను పాఠశాల డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ వి. లింగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, ప్రమోద్ రాజు, జెసిఓ ధర్మరాజు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, శాయంపేట:**




వైఎస్ఆర్సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 53వ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలో వైఎస్సార్ అభిమాని మారపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మళ్లీ ప్రజలు వైఎస్ జగన్ నే కోరుకుంటున్నారని ఆశ భవాన్ని వ్యక్తం చేశారు. వైయస్సార్సీపి పార్టీతోనే ప్రజలకు సంక్షమ పథకాలు అందుతాయని, రానున్న రోజుల్లో జగన్ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ వేడుకలలో వైఎస్ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# కోట్లు వస్తుంటే..

# సస్పెన్షన్ ఓ లెక్కా?!




## ప్రతి శాఖలోనూ రాజ్యమేలుతున్న లంచావతారులు

- ☐ అన్నింట్లో టాప్ 'రెవెన్యూ'దే!
- ☐ ఆ తర్వాత పోలీస్, రిజిస్ట్రేషన్ల డిపార్ట్మెంట్లు
- ☐ ఆర్టీఏ, ఫారెస్ట్, చివరికి ఎండోమెంట్ కూడా అదే దారిలో..
- ☐ క్లర్క్ నుంచి అదనపు కలెక్టర్ స్థాయి వరకూ సైడ్ సంపాదనపైనే..
- ☐ సెటిల్మెంట్ కేంద్రాలుగా సేవా శాఖలు
- ☐ దొరికితే దొంగ.. దొరకక పోతే దొరలు..
- ☐ రాష్ట్రాన్ని చుట్టుముట్టిన అవినీతి జాఢ్యం
- ☐ పారదర్శకతకు పట్టని పరిపాలన




**వేద న్యూస్, క్రైం బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి మహమ్మారి కరాళ నృత్యం చేస్తోంది. రెవెన్యూ, పోలీస్, రిజిస్ట్రేషన్, ఆర్టీఏ, ఫారెస్ట్, ఎండోమెంట్... ఇలా ఏ శాఖలో చూసినా లంచం అనే పదమే లీడర్ అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దొరికితే దొంగ, దొరకకపోతే దొర అన్నట్లుగా కోట్ల రూపాయల దందా యథేచ్ఛగా సాగుతుండగా, ఇటీవల వరుసగా బయటపడుతున్న అవినీతి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అనేది వ్యక్తిగత తప్పిదంగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా మారిందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు.. ఇప్పుడు లంచాలు, ముడుపులు, సెటిల్మెంట్లతో మునిగి తేలుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వరుసగా లంచగొండి అధికారుల బాగోతాలు వెలుగుచూస్తున్నాయి. చిన్న క్లర్క్ స్థాయి నుంచి సబ్ కలెక్టర్, తహసీల్దార్, ఏసీపీ స్థాయి అధికారుల వరకూ అవినీతి ఆరోపణలు రావడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

**– అంతులేని 'రెవెన్యూ' అవినీతి**

రాష్ట్రంలో అత్యధిక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న శాఖగా రెవెన్యూ విభాగం మారింది. ప్రభుత్వానికి కీలకమైన రెవెన్యూ శాఖలో అవినీతి వేళ్లూనుకుపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. భూముల పేర్లు మార్పిడి, పట్టాదారు పాస్‌బుక్‌లు, అసైన్డ్ భూముల వ్యవహారాలు, ప్రభుత్వ భూముల రక్షణ వంటి అంశాల్లో లంచం లేకుండా పని జరగడం లేదన్న ఆరోపణలు సాధారణంగా మారాయి. వివాదాస్పద భూముల పంచాయతీలైతే అవినీతిపరులకు పండుగలా మారాయి. ముఖ్యంగా తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ కలెక్టర్ స్థాయి అధికారులే నేరుగా లంచాల డిమాండ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సబ్ కలెక్టర్ స్థాయి నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు లంచాల బాగోతం వెలుగుచూస్తోంది.

**– సంచలనం.. అదనపు కలెక్టర్ అవినీతి కుంభకోణం**

ఇటీవలే హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అవినీతి కుంభకోణం రాష్ట్రంలోనే పెను సంచలనం సృష్టించింది. ఏసీబీ లోతుగా దర్యాప్తు చేపడుతూ వందల కోట్ల అక్రమ ఆస్తులను వెలికి తీసింది. ఈ ఘటన రెవెన్యూ శాఖలోని అవినీతి లోతుపాతులను కళ్లకు కట్టింది. నాగర్‌కర్నూల్ గత కలెక్టర్ ఉదయ్ కుమార్‌పై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన హయాంలో 300 నుంచి 400 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి చేతులు మారిందని, కల్వకుర్తి నియోజకవర్గంలోని ఉర్కొండలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉర్కొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం, రెవెన్యూ శాఖలోని అవినీతి జాడ్యానికి తాజా ఉదాహరణ.

**– పోలీస్ శాఖలో 'ఖరీదైన' సేవలు..**

శాంతిభద్రతల పరిరక్షకులుగా ఉండాల్సిన పోలీస్ శాఖలోనూ అవినీతి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా కేసుల తారుమారు చేయడం, ల్యాండ్ ఇష్యూస్, సెటిల్మెంట్లలో తలదూర్చి భారీగా డబ్బులు దండుకోవడం నిత్యకృత్యంగా మారింది. రక్షకులుగా ఉండాల్సిన పోలీస్ శాఖ కూడా అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకోలేకపోతోంది. ఇటీవల వరంగల్ జిల్లాకు చెందిన ఏసీపీ, సీఐ, ఎస్ఐలపై అవినీతి ఆరోపణలతో డీజీపీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంకా గతంలోనూ అనేక మంది పోలీస్ ఆఫీసర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ పోలీస్ అధికారి ఏసీబీ అధికారులు పట్టుకునే పయత్నం చేయగా.. పొలం గట్ల వెంట పారిపోయిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అయినా ఏసీబీ అధికారులు, గ్రామస్తులు ఆ పోలీస్ అధికారిని వెంటబడి పట్టుకునే వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడం తెలిసిందే. ఇంకా పోలీస్ వ్యవస్థలో బయటకు రాని ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇది వ్యవస్థలోని లోపాలకు నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**– రిజిస్ట్రేషన్లలో 'డబుల్ల దందా..**

రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి మరింత ప్రమాదకరంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. భూములకు తప్పుడు రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్లు, కోర్టు వివాదంలో ఉన్న భూములకు కూడా రిజిస్ట్రేషన్లు చేయడం, అనుమతులు లేని వెంచర్లు, లేఅవుట్లకు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయడం వంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షల్లో లంచం, భూములను ముడుపులుగా తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న విమర్శలు ప్రజల్లో భయాన్ని పెంచుతున్నాయి.

**– ఆర్టీఏలో మరీ దారుణం..**

రోడ్డు రవాణా శాఖలో డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలకు ఫిట్‌నెస్‌ల విషయంలో భారీగా ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్ వంటి సేవలు ఆర్టీఏ కార్యాలయాల్లో ఇప్పుడు రేటు ఫిక్స్ అయిన ప్రక్రియలుగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీగా ముడుపులు ఇస్తేనే ఫైల్ కదులుతుందన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు జరిగినా, అవినీతి మూలాలు పూర్తిగా తెగిపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**– సస్పెండ్ అయితే ఏమైతది..**

అవినీతికి పాల్పడి పట్టుబడిన అధికారులు, ఉద్యోగుల ఆలోచనా ధోరణి ఆందోళన కలిగిస్తోంది. లక్షల్లో వస్తుంటాయి.. సస్పెన్షన్ ఏమైతది? అనే నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. జీవితకాలంలో కష్టపడి సంపాదించలేనిది, ఒకే ఒక అవినీతి కార్యంతో సంపాదించవచ్చనే భ్రమలో చాలామంది కూరుకుపోతున్నారు. ఈ ధోరణి ప్రభుత్వ శాఖల పారదర్శకతను, ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. ఏసీబీ వలలో అధికారులు పడుతున్నా, వ్యవస్థలో మార్పు కనిపించకపోవడం మరింత గమనార్హం. కాగా, 2025లో తెలంగాణ ఏసీబీ రికార్డు స్థాయిలో 199 కేసులు నమోదు చేయగా, వాటిలో 157 ట్రాప్ కేసులు (రెడ్–హ్యాండెడ్డుగా లంచం అందుకునే స్థితిలో) ఉండి మొత్తం 273 మందిని అరెస్ట్ చేశారని లెక్కలు చెబుతున్నాయి. పట్టుబడిన పెద్ద అధికారుల ఆస్తుల విలువ వేల కోట్లకు చేరవచ్చని కూడా అంచనా

**– ప్రభుత్వం ఏం చేస్తుంది?**

రాష్ట్రంలో అవినీతి వేళ్లు ఊనుకుపోవడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం పట్టుబడటం, సస్పెన్షన్ చేయడంతో సరిపెట్టకుండా, కఠిన శిక్షలు అమలు చేయడం, వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం ద్వారానే ఈ లంచావతారుల్ని అరికట్టడం సాధ్యమవుతుంది. లేదంటే, ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంది. అవినీతి ఘటనలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నా, మూలాలను తెగదెంపులు చేసే చర్యలు ఎక్కడ అన్న ప్రశ్న మిగులుతోంది. పాలకులు, ఉన్నతాధికారులు నిజంగా గట్టిగా స్పందించకపోతే, ఈ లంచావతారం ప్రజాస్వామ్యానికే పెను ముప్పుగా మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

## ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి అధికారులు..

– హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి కేసు.. ఇది రాష్ట్రంలోనే అత్యంత భారీ అవినీతి కేసు. దాదాపు రూ. 1.12 కోట్ల నగదుతో పాటు కిలోల కొద్దీ బంగారాన్ని ఏసీబీ స్వాధీనం చేసుకుంది. భూ సమస్యల పరిష్కారం కోసం భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

– కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు.. తండ్రి పేరిట ఉన్న వ్యవసాయ భూమిని కొడుకు పేరు మీదకు మార్చడానికి (విరాసత్) నివేదిక పంపేందుకు రూ. 50వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

– రంగారెడ్డి జిల్లా గండిపేట తహసీల్దార్.. భూమి రికార్డుల సవరణ కోసం లక్షల్లో లంచం డిమాండ్ చేసిన కేసులో తహసీల్దార్‌తో పాటు కింది స్థాయి సిబ్బందిపై కూడా ఏసీబీ నిఘా పెట్టి చర్యలు తీసుకుంది.

– వరంగల్ జిల్లాలో భూ వివాదాల సెటిల్మెంట్ల కోసం భారీగా నగదు డిమాండ్ చేశారన్న ఆరోపణలతో ఏసీపీతో పాటు సీఐ, ఎస్సైలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వీరు కేసులను తారుమారు చేయడానికి లక్షల రూపాయల లంచాలు తీసుకున్నట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో తేలింది.

– భద్రాది కొత్తగూడెం జిల్లాలో ఫారెస్టు సంబంధమైన ఒక అంశంపై రూ.3.51 లక్షల లంచం తీసుకుంటూ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు చెందిన ప్లాంటేషన్ మేనేజర్ ఏసీబీకి పట్టుబడ్డారు.

– రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని ఎదులపల్లి గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పొన్న సుమతి, మండల పంచాయతీ అధికారి వద్యావత్ తేజ్ సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆవుల చెన్నయ్యలు కలిసి ఫిర్యాదుదారునికి చెందిన నాలుగు ప్లాట్లకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి రూ.2 లక్షల 50 వేల లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుని నుంచి రూ. లక్ష లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

– హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయం పరిధిలో సహాయ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఆకవరం కిరణ్ కుమార్ ఒక సర్వే నంబర్‌పై సర్వే నివేదిక జారీ చేయడానికి రూ.1 లక్ష 50 వేల లంచం డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో ముందస్తుగా రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

– ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ. 30వేలు లంచం తీసుకుంటూ సిద్దిపేట జిల్లా ఎస్సై పట్టుబడిన ఘటన ఇటీవల వార్తల్లో నిలిచింది.

– కోర్టు పరిధిలో ఉన్న భూములకు, అనుమతులు లేని వెంచర్లకు రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్లు రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు లంచం తీసుకుంటున్నట్లు గుర్తించి పలువురిపై కేసులు నమోదు చేశారు.

– గతేడాది చివరలో, ఈ ఏడాది ప్రారంభంలో ఖైరతాబాద్, బండ్లగూడ, వరంగల్ వంటి ఆర్టీఏ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. డ్రైవింగ్ లైసెన్సుల మంజూరు, వాహన ఫిట్‌నెస్ లి సర్టిఫికెట్ల కోసం అనధికారికంగా వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు గుర్తించి, లెక్కల్లో లేని నగదును స్వాధీనం చేసుకున్నారు.









వేద న్యూస్

శుక్రవారం జనవరి 09, 2026

# త్వరలో ప్రత్యేక విద్యా విధానం


ఆయన ఈ విషయాలు తెలిపారు. తెలంగాణకు ప్రత్యేకమైన విద్యా విధానాన్ని త్వరలో తీసుకురానున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, వారి సూచనలతో కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రీఉప్రైమరీ విద్యతో పాటు అవసరమైతే రవాణా సౌకర్యం కల్పించడంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. అలాగే పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. విద్యా రంగంలో కీలక మార్పులలో భాగంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో, 25 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు మినీ యూనివర్సిటీ స్థాయిలో ఈ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను హిమాచల్ ప్రదేశ్ విద్యా మంత్రి రోహిత్ ఠాకూర్ అభినందించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహా జాతరకు రండి..

అందుకే ప్రత్యేకంగా ఆయన నివాసానికి వచ్చి ఆహ్వానించామని వెల్లడించారు. మేడారం జాతర రాష్ట్ర పండుగగా, సంప్రదాయబద్ధంగా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివాసీ బిడ్డలుగా పుట్టిన సమ్మక్కఉసారలమ్మల జాతర ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందిందని చెప్పారు. ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా భక్తుల కోరికలు తీర్చే తల్లులు సమ్మక్క సారలమ్మలని పేర్కొన్నారు. మేడారం మహా జాతరకు కేసీఆర్‌తో పాటు ఆయన సతీమణి శోభమ్మను కూడా ఆహ్వానించినట్లు మంత్రి తెలిపారు. తల్లుల బంగారం, బట్టలను బహుకరించి ఆహ్వానం అందజేయగా, కేసీఆర్ దంపతులు ఆత్మీయంగా స్వీకరించారని చెప్పారు. తమకు కేసీఆర్ తరఫున చీరలు బహుకరించటం ఆనందంగా ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ భేటీలో రాజకీయ చర్చలకు ఆస్కారం లేదని, ఇది పూర్తిగా ఆధ్యాత్మిక, సంప్రదాయ కార్యక్రమమని మంత్రి స్పష్టం చేశారు. ఆడబిడ్డలుగా తాము కేసీఆర్‌ను జాతరకు ఆహ్వానించామని, ఆయన కూడా సానుకూలంగా స్పందించి జాతరకు వస్తానని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆకాంక్ష రెడ్డి తదితరులు కూడా పాల్గొని మేడారం మహా జాతర ఆహ్వానాన్ని అందజేశారు. ఈ ఆహ్వానం రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిందని నేతలు పేర్కొన్నారు.

# 'హెచ్‌టీ' విక్రయిస్తే సహించేది లేదు

- అనుమతి లేని పత్తి విత్తనాలు పూర్తిగా నిషేధం
- సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి
- రైతులను మభ్యపెడుతున్న దళారులపై ఉక్కుపాదం మోపాలి
- పర్యావరణం, రైతుల భవిష్యత్ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణలో అక్రమంగా విక్రయమవుతున్న హెచ్‌టీ (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలపై ఎలాంటి సహనం ఉండదని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సచివాలయంలో ఈ అంశంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేని హెచ్‌టీ పత్తి విత్తనాల విక్రయం, రవాణాపై పూర్తిస్థాయి నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పక్క రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి అక్రమంగా హెచ్‌టీ విత్తనాలు రాకుండా అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని మంత్రి సూచించారు. అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌టీ లేదా బీజీ–3 పత్తి విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతి ఇవ్వలేదని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయి ప్రయోగాలు విఫలమవడం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాల కారణంగానే ఈ విత్తనాలకు అనుమతి నిరాకరించబడిందని చెప్పారు. అయినప్పటికీ కొందరు దళారులు రైతులను మభ్యపెట్టి ఈ విత్తనాలను అక్రమంగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల్లో అవగాహన పెంచేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. హెచ్‌టీ విత్తనాల వల్ల పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లడమే కాకుండా, ఇతర పత్తి హైబ్రిడ్ రకాలలో కలుషితమయ్యే ప్రమాదం ఉందని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు. రాష్ట్రంలో చట్టబద్ధంగా, శాస్త్రీయంగా ఆమోదించబడిన విత్తనాలనే రైతులు వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల భవిష్యత్, పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అక్రమ హెచ్‌టీ పత్తి విత్తనాల విషయంలో జీరో టాలరెన్స్ విధానంతో ముందుకెళ్తామని తుమ్మల నాగేశ్వరరావు తేల్చిచెప్పారు.

# 'రైజింగ్ రేవంత్ రెడ్డి' ఆవిష్కరణ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని ప్రతిబింబిస్తూ 'రైజింగ్ రేవంత్ రెడ్డి' పేరుతో రూపొందించిన సావనీర్‌ను ఈరోజు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ప్రజల కేంద్రంగా చేపట్టిన సంక్షమ, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనలో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ సావనీర్‌లో సమగ్రంగా పొందు పరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విధానపరమైన మార్పులు, ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చిన మెరుగుదల ఈ సావనీర్‌లో స్పష్టంగా కనిపిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షమం రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పాలనలో సాధించిన ప్రగతిని ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమని వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వ పనితీరుపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ సావనీర్, భవిష్యత్తు పాలనా విధానాలకు దిశానిర్దేశం చేస్తుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ప్రజలతో నేరుగా అనుసంధానమయ్యే పాలన కొనసాగుతుందన్న విశ్వాసాన్ని ఈ కార్యక్రమం మరింత బలపరిచిందని తెలిపారు.

# సంక్షమం, అభివృద్ధి రెండూ సమానమే

మెరుగుపడేలా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సంక్షమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని సీఎం వివరించారు. ఒకవైపు సంక్షమ పథకాల ద్వారా పేదలకు భరోసా ఇస్తూనే, మరోవైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, పట్టణ మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో స్పష్టమైన మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం తీవ్రంగా విమర్శించారు. మహాత్మాగాంధీ ఆశయాలతో ప్రారంభమైన ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు పేదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ పథకాన్ని యథతథంగా కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. పేదల హక్కుల కోసం అవసరమైతే పోరాటాలు చేయడానికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కార్యకర్తల పాత్ర కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యకర్తల కష్టం, అంకితభావం వల్లనే ప్రజాప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు అదే కార్యకర్తలను బలోపేతం చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడే రాజకీయమే కాంగ్రెస్ పార్టీ బలమని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రతి మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్న లక్ష్యంతో కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగితేనే రాజకీయాల్లో స్థిరమైన విశ్వాసం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కష్టకాలంలో పార్టీకి అండగా వరంగల్

- ఇవే రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి పునాది
- బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు
- వరంగల్ పర్యటనలో ఘన స్వాగతం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



1984లో బీజేపీకి కేవలం ఇద్దరు లోక్‌సభ సభ్యులు మాత్రమే ఉన్న కాలం నుంచే పార్టీకి అండగా నిలిచిన వరంగల్ నేలపై అడుగుపెట్టడం గర్వకారణమని, కష్టకాలాల్లోనూ పార్టీతో నిలిచిన వరంగల్ బీజేపీ కుటుంబం చూపుతున్న అచంచల నిబద్ధత తన హృదయాన్ని తాకిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచెందర్ రావు అన్నారు. వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమకొండలో భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల ఉత్సాహం, క్రమశిక్షణ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపాయని ఆయన అన్నారు. వరంగల్ జిల్లాలో బీజేపీ శ్రేణులు ప్రదర్శిస్తున్న ఐక్యత, క్రమశిక్షణ, ఉత్సాహం రానున్న రోజుల్లో పార్టీ విజయాలకు పునాదిగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై పోరాటం, జాతీయవాద దృక్పథంతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు సంతోష్ రెడ్డి, రావు పద్మ, ఆరూరి రమేష్, ఎం. ధర్మారావు, సీతారామ్ నాయక్, చాడ స్వాతి, గుజుల వసంత, రావుల కోమల, అభినవ్ భాస్కర్‌తో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

- తహశీల్దార్ కు వినతి




**వేద న్యూస్, భూపాలపల్లి:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, అలాగే రాష్ట్ర కమిటీ ఆదేశాల ప్రకారం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ సూచనలతో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మొగుళ్ళపల్లి మండలం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు జిల్లా యూత్ అధ్యక్షులు బండి సునీల్ జిల్లా నాయకులు గునిగంటి విష్ణువర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే బీసీల సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ వర్గాల సామాజికఉఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే,బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు మరియు చట్టపరమైన రక్షణ అత్యవసరం అని పార్టీ స్పష్టం చేసింది.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రతి బడ్జెట్‌లో బీసీలకు రూ. 20,007 కోట్ల నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీపీఐ ఖమ్మం సభ పోస్టర్ ఆవిష్కరణ




**వేద న్యూస్, దామరచర్ల :**

సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం దామరచర్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సభతో పాటు ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. పార్టీ కార్యక్రమాలు ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లే వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దిరావతు లింగ నాయక్, సీనియర్ నేతలు జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మనరసింహారెడ్డి, భాగం శేషయ్య, పేరుపొంగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నరహరికి న్యూ ఇయర్ విషెస్


**వేద న్యూస్, జమ్మికుంట:**



ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు, పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ని భోపాల్ లో ఆయన నివాసంలో కలిసి ఫౌండేషన్ కోఆర్డినేటర్ గుణసాగర్ నూతన సంవత్సర శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరహరి ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడి కి మనం పెద్దన్న లాగా పనిచెయ్యాలని కోరారు.

# ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌లో విజయం

- కాసిపేట మండలం నుంచి ఉత్తీర్ణత సాధించిన తొలి మహిళగా గోపాతి సింధుజ



**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలానికి గర్వకారణంగా నిలుస్తూ ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్లో ఉత్తీర్ణత సాధించి మండలం నుంచి తొలి మహిళగా గోపాతి సింధుజ చరిత్ర సృష్టించారు. ఆమె సాధించిన ఈ విజయం మండలవ్యాప్తంగా హర్షాతిరేకాలను కలిగించింది. జనవరి 7న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిన ఫలితాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 69.21 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించగా, గ్రామీణ నేపథ్యనికి చెందిన సింధుజ విజయం ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఫలితం న్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాలని ఆశించే యువతకు, ముఖ్యంగా మహిళలకు ప్రేరణగా మారింది. గోపాతి రాజకుమార్, వరలక్ష్మ దంపతుల కుమార్తె అయిన సింధుజ అలుపెరగని కృషి, పట్టుదలతో ఈ క్లిష్టమైన పరీక్షను అధిగమించి సర్టిఫైడ్ లీగల్ ప్రాక్టీషనర్‌గా అర్హత సాధించారు. రాజ్యాంగ చట్టం, క్రిమినల్ ప్రొసీజర్, సివిల్ చట్టాలు, న్యాయ వృత్తి నైతికత వంటి అంశాలపై లోతైన అవగాహనతో ఆమె ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. సింధుజ సాధించిన ఈ ఘనత కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా, చిన్న మండలాల్లో మహిళల విద్యా అవకాశాలపై ఉన్న సామాజిక అడ్డంకులను అధిగమించిన మైలురాయిగా పలువురు ప్రశంసిస్తున్నారు. పట్టుదలతో లక్ష్యాన్ని సాధిస్తే ఏ శిఖరాన్నైనా చేరుకోవచ్చని ఆమె విజయం నిరూపించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 09, 2026

# విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వైన్స్
- ఎక్సైజ్ అధికారులకు ఏఐఎఫ్‌టీయూ న్యూ ఫిర్యాదు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్‌కు ఏఐఎఫ్‌టీయూ న్యూ నేతలు ఫిర్యాదు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లాలోని వైన్ షాపులు బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ వాటిని ప్రోత్సహిస్తున్నాయని, దీని వల్ల గ్రామాల్లో కిరాణా షాపులు, హోటళ్లు అన్న తేడా లేకుండా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైన్స్‌ల నుంచి అక్రమ మద్యం రవాణా జరగడం వల్ల పర్మిట్ రూములు మినీ బార్‌లను తలదన్నేలా విశాలమైన స్థలాల్లో నిర్వహించబడుతున్నాయని ఆరోపించారు. నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, లూజ్ వాటర్ విక్రయాలు కొనసాగుతుండగా, నిబంధనలకు విరుద్ధంగా నాన్‌వెజ్ తినుబండారాలు కూడా యథేచ్ఛగా విక్రయిస్తున్నారని తెలిపారు. నిలబడి మద్యం సేవించాలన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసి, కార్మికులు, కర్షకులు పొద్దంతా పర్మిట్ రూముల్లోనే గడిపేలా వసతులు కల్పిస్తున్నారని ఆరోపించారు. దీని ఫలితంగా సామాన్య ప్రజలు, కార్మికులు, కర్షకులు, యువత మద్యానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చీప్ లిక్కర్ విధానంతో ఆదాయానికే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తూ మద్యం ఆదాయంపైనే ఆధారపడుతోందని, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్యంపై కఠిన నియంత్రణలు విధించి, క్రమేపి మద్యం విక్రయాలను తగ్గిస్తూ మద్యపాన నిషేధం దిశగా అడుగులు వేయాలని, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రయత్నించాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ పక్షన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం, గుజ్జే దేవదాస్, ఆక నీ సత్తయ్య, సలేంద్రి ఎల్లయ్య, రాజేశం, బొలపర్తి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రివర్స్ ఆఫ్ గ్రేస్ణ ఆవిష్కరణ

- ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ రచనకు కేయూలో ఘనంగా ఆవిష్కరణ
- జల వనరుల ప్రాధాన్యతపై లోతైన విశ్లేషణ: వక్తలు



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు, అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ రచించిన రివర్స్ ఆఫ్ గ్రేస్ గ్రంథన్ని యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ గ్రంథన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ చీఫ్ కన్వీనర్ డాక్టర్ అనిల్ కుమార్ ఠాకూర్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అంశాలపై లోతైన పరిశోధనలు చేసి అనేక వ్యాసాలు, గ్రంథలు రచించిన అనుభవం కలిగిన విద్యావేత్త అని ప్రశంసించారు. రివర్స్ ఆఫ్ గ్రేస్ గ్రంథంలో మానవ జీవనంలో జల వనరుల కీలక పాత్రను విశ్లేషణాత్మకంగా వివరించినట్లు తెలిపారు. ఈ గ్రంథం సామాజిక శాస్త్ర పరిశోధకులకే కాకుండా అన్ని విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు అధ్యయనం చేయాల్సిన ప్రాధాన్యత కలిగినదని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు కే. అనిత రెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ వీరేందర్, డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ హరి శంకర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇది కదా మానవత్వం!



- వికలాంగుడై తోటి వికలాంగురాలికి ట్రైసైకిల్ అందజేత
- గొప్ప మనసు చాటుకున్న తాడం రాజయ్య

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన వికలాంగుడు తాడం రాజయ్య తన గ్రామానికే చెందిన మరో వికలాంగురాలికి స్వయంగా ట్రైసైకిల్ అందజేసి మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారు. తాను ఆర్థికంగా పెద్దగా బలంగా లేకపోయినా, తోటి వికలాంగురాలి కష్టాన్ని గుర్తించి సహాయం చేయడం ఆయన విశాల హృదయాన్ని చాటుతోంది. వికలాంగుల బాధలు స్వయంగా అనుభవించిన వ్యక్తిగా, అవసరంలో ఉన్న వారికి చేయూత ఇవ్వాలనే తపనతో ఈ సహాయం చేసినట్లు రాజయ్య తెలిపారు. పైడాకుల అశోక్ సహకారంతో ట్రైసైకిల్‌ను కొనుగోలు చేసి అందజేశామని, ప్రణవ్ సారధ్య నేతృత్వంలో వికలాంగుల సంక్షమం కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. వికలాంగులకు అవసరం వచ్చినప్పుడు తాము ముందుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కదురు కవిత, ఉపసర్పంచ్ తాడెం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరి వెంకటేశ్వర్లు, జక్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంపీఎఫ్ సేవలను వేగవంతం చేశాం

- పెన్షన్, సీఎంపీఎఫ్ క్లైమ్స్‌కు జీరో పెండింగ్ లక్ష్యం
- సీ-కేర్ పోర్టల్, ప్రయాస్ విధానంతో త్వరిత పరిష్కారం
- సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-2 డా. కే. గోవర్ధన్

**వేద న్యూస్, మందమర్రి టౌన్**




పదవీ విరమణ పొందిన కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు జాప్యం లేకుండా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) రీజినల్ కమిషనర్-2 డా. కే. గోవర్ధన్ తెలిపారు. గురువారం మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్, పెన్షన్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలు సీ-కేర్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్తగా పెన్షన్ సేవలను వేగంగా పూర్తిచేయడానికి 'ప్రయాస్ణ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ లక్ష్యంతో సీఎంపీఎఫ్ పెన్షన్ క్లైమ్స్‌ను త్వరగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సేవలు అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 375 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ సెటిల్‌మెంట్ కాపీలను సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం (పర్సనల్) అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సిఎంపీఎఫ్ ఎన్ఫోర్మెంట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్ఎస్ఓ కే. వెంకట్ రెడ్డి, గనుల సంక్షమ అధికారులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- మందు తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షలు తప్పవు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. ప్రజా శాంతి భద్రతలు, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 61 మందిపై, మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో బహిరంగ మద్యం సేవించే ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌లు చేపడుతున్నట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకుని, రద్దు చేయాలని సంబం ధిత రవాణా శాఖ అధికారులకు సిఫార సు చేస్తామని తెలిపారు.



# రోడ్డు భద్రత అందరి బాధ్యత



- ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలి
- ప్రాణాలు కాపాడే వారికి రూ.25 వేల ఆర్థిక సహాయం
- క్షతగాత్రులకు రూ.లక్షన్నర వరకు వైద్య సదుపాయం
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రవాణా శాఖా ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- హాజరైన ఎస్పీ మహేష్ బి గితే

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రోడ్డు పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో గత ఏడాది లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగి వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. జిల్లాలో కూడా రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా ఉన్నాయని, వాటి నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైవర్లు వాహనం నడిపే ముందు తమ కుటుంబ బాధ్యతను గుర్తుంచుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, సెల్‌ఫోన్ ఉపయోగించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి 'రహవీర్ గుడ్ సమారిటన్ణ పథకం కింద రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తామని, అలాగే క్షతగాత్రులకు ఆసుపత్రుల్లో రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే వెసులుబాటు ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ. . డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ వినియోగంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు భద్రత చర్యల వల్ల గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవాణా, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ, పోలీస్ శాఖల అధికారులు, డ్రైవర్లు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

- నూతన జాతీయ విద్యావిధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- కేయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలి
- పెండింగ్ ఫీజులు చెల్లింపులు చెయ్యకపోతే చదువులు కొనసాగేదెలా?
- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్




**వేద న్యూస్, కేయూ క్యాంపస్ :**

సమాజానికి అవసరమైన సామాజిక, ఆర్థిక, మానవీయ విలువలు అందించే విద్యను నేటి పాలకులు భ్రష్టుపట్టిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడె ఎన్ఏ స్టాలిన్ విమర్శించారు. యూనివర్సిటీలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ 10వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం-2020 ద్వారా విద్యను కేంద్రీకరణ, ప్రైవేటీకరణ వైపు నడిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ (వీబీఎస్ఏ) బిల్లు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, లౌకిక స్వభావానికి భంగం కలిగించేలా ఉందని అన్నారు. వెంటనే ఆ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జీ రెహమాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఓయూకు కేటాయించినట్లే ప్రతి యూనివర్సిటీకి రూ.1000 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోతే విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. ఖాళీ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ఏఐఎస్ఎఫ్ కేయూ నూతన కమిటీ ఎన్నిక**

ఈ మహాసభలో ఏఐఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొమ్ము సాయికృష్ణ, కార్యదర్శిగా బొజ్జ జ్యోతి, ఉపాధ్యక్షులుగా తాండ్ర రాజేష్, బండి లావణ్య, సహాయ కార్యదర్శులుగా సిహెచ్ వంశీ, సారిక, కోశాధికారిగా తేజ ఎన్నికయ్యారు.

# రోడ్డు భద్రతపై ముగ్గుల పోటీలు

- సహాయ వలంటీర్ ఆధ్వర్యంలో అవగాహన



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద సహాయ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వ హించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముగ్గుల పోటీల్లో కస్తూర్బా గాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీ పాఠశాల విద్యార్థినీలు పాల్గొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను ప్రతిబింబించేలా రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినీలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, ఆర్టీఓ శ్రీనివాస్, తహసీల్దార్ తారాబాయి, సహాయ వాలంటీర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు నీలకంఠం, అన్నపూర్ణ, కార్యదర్శి వి.ఎం. శివకుమార్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజా ప్రతి నిధులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మాథ్స్ టాలెంట్ శిక్షణ శిబిరంలో కేయూ విద్యార్థులు

- దేశవ్యాప్తంగా ఎంపికైన 40 మందిలో ఇద్దరు మనోళ్లే
- ఐఐటీ తిరుపతిలో గణిత శాస్త్రంపై లోతైన శిక్షణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు కే. భార్గవ్, డి. హరీశ్ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి గణిత టాలెంట్ శిక్షణ శిబిరం (ఎమ్‌టీటీఎస్)కు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, అందులో ఇద్దరు కేయూ విద్యార్థులు ఉండడం విశేషం. ఈ శిక్షణ శిబిరం డిసెంబర్ 29 నుంచి జనవరి 3 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఐఐటీ తిరుపతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ డా. సుకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రియల్ అనాలిసిస్, లీనియర్ ఆల్జీబ్రా, మాథమేటికల్ అప్లికేషన్స్ అంశాలపై లోతైన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగాధిపతి తండు నాగయ్య, అధ్యాపకులు డాక్టర్ మంజుల, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, అలాగే కాకతీయ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కే. ప్రతాప్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 09, 2026

## కోతుల బెడద నివారించడానికి నిర్ణయం



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటం తో గ్రామస్తులు గురువారం కమిటీగా ఏర్పడి కోతుల బెడదను తొలగించు కోవడానికి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొమ్మాటి నర్స య్య అధ్యక్షతన అన్ని కుల సంఘాల పెద్ద మనుషులు గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకొని కోతులు కుక్కలు గ్రామంలో ఇబ్బందికరంగా మారాయని అన్నారు. చిన్నపిల్లలు మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని తక్షణమే వీటి నుండి రక్షణ పొందే విధంగా పదిమంది పెద్ద మనుషులతో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి కొంత నగదును జమ చేసుకొని ఆరు నెలల కాలం వరకు కోతులు కుక్కల బెడద తీర్చుకోవాలని సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు, కుల సంఘాల పెద్ద మనుషులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం జరిగిన ముగ్గుల పోటీలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోనేరు శశాంక్ మొదటి 12 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు కటికే రామ్ రాజ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ప్రజాబాట కార్యక్రమం

**– రైతుల పొలాల వద్దకే వెళ్లి విద్యుత్ సమస్యల పరిష్కారం**



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామంలో టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను నేరుగా వారి వద్దకే వెళ్లి పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఈ వంశీకృష్ణ మాట్లాడుతూ.. రైతుల పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరాలోని లోపాలను అక్కడికక్కడే సరిచేస్తున్నామని చెప్పారు. పొలాల మీదుగా ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి రైతులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ ఏఈ రాములు, ఎస్ఎల్ఐ మోహన్, లైన్‌మెన్లు షాబుద్దీన్, మహేందర్ రెడ్డి, శీను, ఏఎల్ఎంలు నరేష్, ప్రేమ్ కుమార్, సంతోష్, కుమార్, విద్యాసాగర్, మల్లం రాజు, సిబ్బంది రాజేష్, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలానికి చెందిన స్వర్గీయ బాసని కైలాసం, కనుక లక్ష్మ జ్ఞాపకార్థం వారి కుమారులు బాసని చంద్రప్రకాష్, బాసని జయప్రకాష్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, విద్యార్థినులకు ఆల్ ఇన్ వన్ బుక్స్, ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకొని పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. చదువే భవిష్యత్తుకు బాట వేస్తుందని, ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం బాసని చంద్రప్రకాష్ మాట్లాడుతూ, తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు చేయూత అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మండలంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు సేవ చేయడం జీవితంలో మరువలేని అనుభూతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో, ఎంఈఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన పోలీసులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వేములవాడ ఏఎస్పీ

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలోని దేశాయిపల్లి శివారులో జరిగిన కత్తిదాడి ఘటన కలకలం రేపింది. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గండి శ్రీధర్ అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన సావనపెల్లి శశి ప్రీతమ్ పై కత్తితో దాడి చేయడంతో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు బోయినిపల్లి పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. దాడికి గల కారణాలు, కేసు పూర్వాపరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిందితుడిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు. ఆయన వెంట వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, బోయినిపల్లి ఎస్ఐ ఎన్. రమకాంత్ ఉన్నారు. ప్రస్తుతం పోలీసులు కేసును లోతుగా విచారిస్తున్నారు.

## ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతలు పూడ్చాలి

**– యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి**




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉన్న ప్రమాదకర ఇంకుడు గుంతలను వెంటనే పూడ్చాలని కోరుతూ బోయినిపల్లి ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ వినతిని యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీ ఏనుగుల ప్రశాంత్ కుమార్, విలాసాగర్ గ్రామ వార్డు సభ్యుడు దమ్మ వెంకటరమణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణంలో ఇంకుడు గుంతలు ఉండటంతో విద్యార్థుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే గుంతలో ఒక విద్యార్థి పడిపోవడంతో తీవ్ర గాయాలు అయిన సంఘటనను గుర్తు చేస్తూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతలను పూడ్చి పాఠశాల ఆవరణను సురక్షతంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎమ్మార్వో సమస్యపై సానుకూలంగా స్పందించి, తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## కేటీఆర్ నోటి దూల తగ్గించుకో..!

**– క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ, ప్రజా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి జోలికొస్తే ఖబడ్దార్ : కుల్ల యకాంతం**



**వేద న్యూస్, వర్ధన్నపేట :**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై యువజన కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యకాంతం మండిపడ్డారు. సభ్యత లేకుండా మాట్లాడటం సరికాదని విమర్శించారు . గురువారం యకాంతం ఒక ప్రకటనలో విడుదల చేశారు. జనగామ బీఆర్ఎస్ సభలో కేటీఆర్.. రాహుల్‌గాంధీని 'హౌలాగాడు' అని సంబోధించడం సరికాదని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ కుటుంబం కాళ్లు పట్టుకున్న నీవు.. హౌలా.. అంటూ మాట్లాడుతావా ? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఓ ఐపీఎస్ అధికారిని బూతులు తిట్టారని, వాళ్ల బతుకులు అంతేనంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్‌కు సిగ్గు, శరం లేదని, ఆయనను బ్రోకర్, లఫూట్ గాడని తిట్టలేమా? అని అన్నారు. రాహుల్‌గాంధీకి క్షమాపణలు చెప్పే వరకు కేటీఆర్‌ను వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని విమర్శించే తీరు చూస్తే కేటీఆర్‌లో అసహనం పరాకాష్టకు చేరిందని యకాంతం అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయి.. కానీ ఈ విధమైన భాష మంచిది కాదని హితవు పలికారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని ఒక ప్రకటనలో కొనియాడారు. రాహుల్ గాంధీని ఇలాగే విమర్శించిన పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. రాహుల గాంధీని విమర్శించే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని అన్నారు. సభ్యత లేకుండా మాట్లాడిన కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రేటర్ హైదరాబాద్, రాష్ట్రంలో కేటీఆర్‌ను ఎక్కడ తిరగనివ్వబోమని, బట్టలు ఊడదీసి తమ కార్యకర్తలు కొడతారని హెచ్చరించారు. ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పినప్పటికీ కేటీఆర్‌కు అహంకారం, నోటి దురుసు తగ్గలేదన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఎదుట మాట్లాడేందుకు ధైర్యం లేని కేటీఆర్.. రోడ్ల వెంట తిరుగుతున్నారని విమర్శించారు.మాట్లాడే విషయంలో కేటీఆర్ అదుపు తప్పుతున్నారని, స్థాయి, హద్దులు దాటి మాట్లాడటం సరికాదని విమర్శించారు. రాహుల్ గాంధీకి ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ మానసిక స్థితిపై ఆయన భార్య శైలిమ జాగ్రత్తగా గమనించాలని ఆయన సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మరో మారు పనికిరాని వ్యాఖ్యలు చేస్తే ఊహించని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అందుకు సిద్ధంగా ఉండాలని యకాంతం సూచించారు. అలాగే కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా వరంగల్ అర్బన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ ఆదేశాలను అనుసరిస్తూ పెద్ద ఎత్తున కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొని యువజన కాంగ్రెస్ సత్తా చాటాలని కుల్ల యాకాంతం పిలుపునిచ్చారు.

## సేవే హరిప్రసాద్ లక్ష్యం

- సమాజసేవలో ముందు వరుసలో
- బూజునూరు పేరు నిలబెడుతున్న ఎన్ఆర్ఐ





**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండలం బూజునూరు గ్రామానికి చెందిన యువ నాయకుడు, ఎన్ఆర్ఐ సరిగొమ్ముల హరిప్రసాద్ సేవా భావంతో ముందుకు సాగుతూ..గ్రామ ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు. విదేశాల్లో స్థిరపడినా, తన మట్టి మీద ప్రేమను మరచిపోకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడుస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు.గ్రామంలోని నిరుపేద కుటుంబాలు, నిరుద్యోగ యువతకు భరోసాగా నిలుస్తూ, పేద విద్యార్థులకు సైకిళ్లు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేసి వారి చదువుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. అలాగే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు తన వంతు ఆర్థిక సహాయం అందిస్తూ మానవత్వానికి అర్థం చెబుతున్నారు.

**సమాజసేవలో ముందు వరుసలో**

గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న హరిప్రసాద్‌ను గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతలతో సేవ చేస్తున్న యువ నాయకుడిగా హరిప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని గ్రామస్తులు ఆకాంక్షస్తున్నారు.

## సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే




– తహసిల్దార్ ముప్పు కృష్ణ

**వేద న్యూస్, నల్లబెల్లి:**

సమాజంలో అన్ని వృత్తులను తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అలాంటి ఉపాధ్యాయులు హక్కుల కోసమే కాకుండా, బాధ్యతగా ఉంటూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని నల్లబెల్లి తహసిల్దార్ ముప్పు కృష్ణ అన్నారు. పిఆర్ టియు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉడుత రాజేందర్, ప్రధాన కార్యదర్శి బానోత్ కృష్ణ ,పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్ సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులుపురం బద్రీనాథ్, లడే రవీందర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కందకట్ల నాగరాజు, ఉపాధ్యాయులు జి సునీల్ పాల్గొన్నారు.

## మట్టి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన




– నేల సారవంతతపై శిక్షణ

**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్లో గురువారం విద్యార్థులకు నేల ఆరోగ్యం, మట్టి సారవంతత, మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద, విద్యార్థుల్లో వ్యవసాయం మరియు పర్యావరణ పరిరక్షణపై చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మట్టి ప్రాధాన్యత, మట్టి సారవంతత, మట్టి నమూనా సేకరణ పద్ధతులు, మట్టి పరీక్షల ఆధారంగా పంటలకు సరైన ఎరువుల వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. విద్యార్థులు ప్రత్యక్షంగా మట్టి నమూనా సేకరణను పరిశీలించి, మట్టి ఆరోగ్యం కాపాడుకోవడం ఎంత ముఖ్యమో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తి, శాస్త్రీయ దృష్టికోణం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంఈఓ వెంకటేశ్వర స్వామి, ఏఈఓ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లేడీస్ హాస్టల్ మెస్ సమస్యలు పరిష్కరించాలి

**– నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థినుల నిరసన**




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని పద్మాక్ష లేడీస్ హాస్టల్ మెస్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థినులు భారీ ర్యాలీ నిర్వహించి యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడించారు. మెస్‌లో నాణ్యమైన భోజనం అందడం లేదని, ప్రతి విద్యార్థినికి సరైన విధానంలో ఆహారం అందడం లేదని నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. వీసీ చాంబర్ ముట్టడి అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అధికారులు, విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారం రోజుల్లో మెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని వీసీ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు తమ నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073